
# ప్లీజ్... నన్ను శపించకు నేస్తం"

తులసి బాలకృష్ణ



జ్యోత్స్న ప్రవర్తనకి నిర్ఘాంతపోయాడు కమలాకర్. నోట మాటరాక నిలబడి పోయాడు కమలాకర్. తనెరిగిన జ్యోత్స్నేనా ఇలా ప్రవర్తిస్తున్నది అని ఆశ్చర్యపోయాడు. అసలు జరుగుతున్నది కలా నిజమా అనే అనుమానంతో గిజగిజలాడి పోయాడు....

.... జ్యోత్స్న!!

– ఏడెనిమిది నెలల క్రితం తను కాలేజీని, ఆ తర్వాత ఈ ఊరిని వదిలిపెట్టే వరకూ తన నీడై తిరుగుతూ, గురువుగా పూజించి, స్నేహితుడిగా ఆప్యాయత కురిపించి, కళాకారుడిగా ఆరాధించి, తనే లోకం అన్నట్లుగా ప్రవర్తించిన జ్యోత్స్న.... "నాలో నిద్రాణంగా వున్న కళల్ని తట్టి లేపింది నువ్వే కమలాకర్" అని కృతజ్ఞతతో పలికిన జ్యోత్స్న.... "నువ్వెళ్ళిపోతే మన కళాశాలలో కళ పోయి వట్టి శాల మాత్రం మిగులుతుంది" అని డగ్గుత్తికతో పలికిన జ్యోత్స్న.... "నువ్వే నాకు గురువువి, స్నేహితుడివి, ఆదర్శానివి, అన్నవి, అన్నీ. రేపొద్దున్న నాకు భర్తగా లభించే వ్యక్తి నీతో నా పరిచయానికి అభ్యంతరం చెప్తే– అతన్నే వదిలి పెడ్తాను. లేదా, అవసరమయితే జీవితమే వదిలి పెడ్తాను" అంటూ ఘోరమైన శపథం చేసిన జ్యోత్స్న.... ఇంత కేర్‌లెస్‌గా.. ఇంత గర్వంగా. . ఎవరో మామూలు వ్యక్తి దగ్గర, క్రొత్త వ్యక్తి దగ్గర ప్రవర్తించినట్లుగా.. !?!

"ఒకవేళ నేనే పొరబాటు పడుతున్నానేమో. పని వత్తిడితో ఆమె బిజీగా వుండి వుంటొచ్చు– మరోసారి పలకరిద్దాం. ఏమయినా అవసరమయితే సాయం చేద్దాం" అనుకుంటూ, స్టేజి డికరేషన్ డైరెక్టు చేస్తున్న ఆమె వద్దకు నడిచి, "ఏం జ్యోత్స్నా– ఎలా వుంది కల్చరల్ సెక్రటరీగా రెస్పాన్సిబిలిటీ? ఇంతకు ముందు ప్రతి కాలేజీడేనాడూ నేను కంగారు పడ్తుంటే ఎగతాళి చేసే దానివి కదా– ఇప్పుడు అనుభవంలోకి వచ్చిందా అమ్మాయికి?!" అంటూ ఉడికిస్తున్నట్లుగా నవ్వాడు కమలాకర్

చర్రున అతని వైపు తిరిగి, తీవ్ర స్వరంతో అంది జ్యోత్స్న, "నో– నాథింగ్. చాలా సునాయాసంగా చిటికల మీద జరిపించేస్తున్నాను పనులన్నీ. అన్‌డౌటెడ్‌గా గ్రాండ్ సక్సెస్ అయి తీరుతుంది ప్రోగ్రాం."

– దెబ్బ తిన్నాడు కమలాకర్.

గతంలో లాగ చనువుగా, ఆప్యాయంగా, హాస్యయుతంగా జవాబు చెప్తుందేమో, "కొంచెం సజెషన్సిచ్చి, హెల్ప్ చెయ్యకూడదా పెద్ద" అని ముద్దొచ్చేట్లు జాలిగా అడుగుతుందేమో నని ఆశ పడి, భంగపడ్డాడు.

జ్యోత్స్న అక్కడ్నుంచి కదలి, పని వాళ్ళకు ఏవో పురమాయించి, మళ్ళీ ఇటు వస్తూ, "అవునూ, ఒక్కడివే వచ్చావా– మీ ఆవిడని కూడా తీసుకొచ్చావా?" అనడిగింది. కాని ఆ ప్రశ్నలో ఆశించే జవాబు ఏమీ అగుపడలేదు కమలాకర్‌కి గాయపడ్డ మనసుతో అన్నాడు, "కేవలం పెర్ఫార్మెన్స్ ఇచ్చి బాధ్యత తీర్చుకోవడానికేగా నాకు పిలుపు వచ్చింది. నాకిక్కడ ఎవ్వరూ సన్మానం చెయ్యడం లేదు కదా! అందుకనే ఒక్కడినీ వచ్చాను"– ఈ సారన్నా తన బాధని అర్థం చేసుకుంటుందేమో నన్న చిరు ఆశ తొణికిసలాడింది అతని గొంతులో.

ఆ మాటల్ని పట్టించుకోలేదు జ్యోత్స్న. "ఏం కమలాకర్– పనుల హడావుడిలో నిన్ను నేను సరిగ్గా పట్టించుకోక హర్ట్ చేసానా? హర్ట్ చేస్తే మాత్రం కైండ్లీ ఎక్స్‌క్యూజ్‌మి" అని క్షమాపణలు చెప్పు కోలేదు. పైగా ఇలా అంది, "ఈవాళ నీ మోనో యాక్షన్ చాలా సింపుల్ అండ్ సూపర్బ్‌గా వుండాలి.

అంతా ఎలైట్ వస్తున్నారు. నీకు టెన్ మినిట్స్ టైమ్. దాటకూడదు సుమా. ఆ! అన్నట్లు, మునుపట్లా ఆ ఏడుపులూ, పెడబొబ్బలవీ వద్దు. చక్కగా హాయిగా డిసెంట్‌గా నవ్వొచ్చేదేదైనా చెయ్యి. ఓకే?"

అదురుతూన్న గుండెల్ని చిక్కబట్టుకుంటూ, తలదించుకుని, ఎఱ్ఱబడ్డ ముఖంతో, ప్రయత్నం మీద గొంతు పెగల్చుకుని, అన్నాడు కమలాకర్, "నాకు చేత నయినదేదో చేస్తాను."

"రైట్. నేనొస్తాను. ఈరోజు ఛీఫ్‌గెస్ట్‌గా సినీహీరో కళ్యాణ్ వస్తున్నారు. ఈ రోజు ఆయనే మెయిన్ ఎట్రాక్షన్. గెస్ట్‌హవుస్‌లో దిగారు. నేను వెళ్ళి, ప్రోగ్రాంటైముకి కారులో తీసుకు వస్తాను. ఈలోగా నువ్వు ఇంకొకసారి పోర్షన్ అది బాగా చూసుకుని; టైముకి మేకప్ చేయించుకుని రెడీగా వుండు" అని హడావుడిగా వెళ్ళిపోతూన్న ఆమెని మంచు తెరల్లాంటి కన్నీటిపొరల వెనుకగా చూస్తూండి పోయాడు-

గుండెలు మండుతున్నాయి.

మనస్సుకి పెద్ద బండరాయి కట్టి గుంజుతున్నట్లుగా వుంది.

కొద్ది నెలల క్రితం వరకూ కల్చరల్ ఏక్టివిటీస్‌కి మకుటంలేని మహారాజై తను ఏలిన తన కాలేజీలో.... తనొక అనామకుడిలా.... బ్రతిమాలి తన కళను ప్రదర్శించు కునేందుకు ఛాన్సు సంపాదించుకున్న వాడిలా....

ఆపుకోలేని బాధలో అతని కళ్లనిండా నీళ్ళు ఉబికాయి.

..... తనకు ఎంతో చక్కటి ఆహ్వానం, ఆప్యాయత లభిస్తుందనీ, తన రాకతో ప్రోగ్రాంకే కళ వచ్చిందంటూ జ్యోత్స్న సంతోషిస్తుందని ఎంతో ఆశించాడు. కాని ఇలా.....

అప్రయత్నంగా ఆడిటోరియం బయటకు నడిచి, కాలేజీ ఆవరణంతా ప్రేమగా కలియ చూశాడు. అయిదు సంవత్సరాల పాటు తనని అందలం ఎక్కించి తాము బోయీలై అభిమానంతో మోసిన

## "ప్లీజ్ - నన్ను శపించు నేస్తం"

చెట్లూ, ఆట స్థలాలూ, భవంతులూ, ఆనందంతో పులకించి పోతూ, ఆప్యాయంగా పలకరిస్తూన్న భ్రాంతి కలుగుతోంది.

టైము చూసుకున్నాడు - మూడు.

ఇంకా ప్రోగ్రాం ప్రారంభమవడానికి నాలుగు గంటల టైముంది.

జ్యోత్స్న నుంచి వచ్చిన ఆహ్వానానికి సంబరపడి పోయి, ఆఫీసరుని ఎంతో బ్రతిమలాడి, రెండు రోజుల శెలవు మాత్రం అతి ప్రయత్నం మీద సంపాదించుకుని, భార్య ప్రోత్సాహాన్ని పొంది, గర్భవతి అయిన ఆమె నొక్కత్తెని అక్కడే తప్పనిసరి అయి వదలి, రాత్రి రైలు ఎక్కితే- ఈ ఉదయానికే చేర వలసిన రైలు, ఆలస్యమయి మధ్యాహ్నం ఒంటి గంటకు చేర్చింది. లాడ్జికి పోయి, హడావుడిగా స్నానపానాదులు ముగించుకుని, రెండు మెతుకులు కొరికి, ఇక్కడ తన సహాయం ఏవిధంగా కావలసి వస్తుందో నని కాలేజీకి పరుగెత్తుకు వస్తే..... లభించిన గౌరవం ఇది-

కాలేజీ ఆవరణంతా దాదాపు నిర్మానుష్యంగా వుంది.

ఒకళ్ళిద్దరు వాలంటీర్లు, పనివాళ్లు ఆడిటోరియం సర్దడంలో బిజీగా వున్నారు.

ఇప్పుడేవిటి చెయ్యడం? ఊళ్లో తన నెరిగివున్న స్నేహితులు కొన్ని వందలున్నారు. కాని చెదిరిన మనస్సుతో వాళ్లని కలిసి ఎంజాయ్ చేయగలడా తను? ఇంతగా ఆశాభంగం చెంది కూడా, రాత్రి వరకూ వుండి, పెర్ఫార్మెన్స్ ఇచ్చి, అనామకుడిగా వెళ్ళి పోవడమా, లేక ఇప్పుడే చడీచప్పుడూ లేకుండా వెళ్ళిపోవడమా? అలా వెళ్ళిపోతే..... ఆమె తనని ద్రోహి అనుకోదూ? ఇంకా ఏ కొశానో మిగిలిన ఆ కొంచెం అనురాగం కూడా ఇగిరిపోదూ?! మరి ఉంటే.... ఈ బాధతో తను అంత క్లిష్టమయిన పాత్రని విజయవంతంగా పోషించగలడా?!..... ఏమో, ఈ బాధే ఆ పాత్ర పోషణకి బాసటగా నిలుస్తుందేమో..... సాయంత్రానికి ఆమె మారి, మంచిగా ప్రవర్తిస్తుందేమో..... ఏది ఏమయినా అసలైన కళాకారుడు ఎప్పుడూ ప్రదర్శన ఇవ్వకుండా మోసం చేయకూడదు.... ఉండి పోవడానికే నిశ్చయించు కున్నాడు కమలాకర్.

నెమ్మదిగా గ్రౌండ్స్ మధ్యలో వున్న మర్రి చెట్టు దగ్గరకు నడిచి, వ్రేళ్ల మీద జరిగి, ఆకుల మధ్యగా ఆకాశాన్ని చూస్తూ, గతంలోని మధురానుభూతుల్ని నెమరు వేసుకోవాలని ప్రయత్నమయితే చేశాడు కానీ, మనసు మాత్రం పదే పదే ఈ రోజు కలిగిన బాధకే మూగగా మూలుగుతోంది.

-పశ్చిమాకాశం సంధ్యారాగాన్ని సంతరించుకుని, ఎఱ్ఱ చీర ధరించి, అరుణ బింబాన్ని బొట్టుగా దిద్దుకుని ముస్తాబవుతూండగా, స్టూడెంట్లూ, లెక్చరర్లూ ఒక్కొక్కరే వస్తూండటంతో కాలేజీ ఆవరణ కళకళ లాడసాగింది. వస్తూన్న వారి నెవ్వరినీ ఆకర్షించడం ఇష్టం లేక చెట్టు చాటుకు పోయి కూర్చున్నాడు గాని, అతనిని కొందరు గమనించడం, అతనిని చుట్టు ముట్టి, అతనిప్పుడు ఎక్కడుంటున్నదీ ఏం చేస్తున్నదీ కనుక్కుని, అతని ఏక్టివిటీస్ గురించి విచారించి, ఈ రోజు అతను ఏం పెర్ఫార్మెన్స్ ఇవ్వబోతున్నాడో ఉత్సుకతతో వాకబు చేస్తూంటే- తిరిగి ఉత్సాహం పుంజుకుంది కమలాకర్‌లో. చాలా సరదాగా వాళ్లతో సంభాషిస్తూంటే ఒక వాలంటీర్ వచ్చి, "కమలాకర్ గారూ- ఈ రోజు కల్చరల్ ప్రోగ్రాంలో పార్టిసిపేట్ చేసే వాళ్లందర్నీ వెంటనే గ్రీన్ రూం లోకి వెళ్లి తయారు కమ్మని జ్యోత్స్న గారు కబురు పంపారండీ. ప్లీజ్ మీరు రావాలి" అన్నాడు.


"ఓ ష్యూర్" అంటూ, మిత్రుల దగ్గర శెలవు తీసుకుని, గ్రీన్‌రూం వైపు నడిచాడు కమలాకర్.

అతని వెనకనే నడుస్తూన్న ఒక స్టూడెంట్ అడుగుతున్నాడు వచ్చి పిలిచిన వాలంటీర్ని, "జ్యోత్స్న ఎక్కడుంది?"

"సినిమా హీరో కల్యాణ్ వచ్చాడుకదా. గెస్ట్ హవుస్‌లో దిగాడు. ఆయన గారిని తీసుకు రావడానికి మధ్యాహ్నం వనగా వెళ్ళింది. అక్కణ్నుంచే ఆర్డర్లు జారీ చేస్తోంది. ఒళ్లు మండి పోతోంది నాకు. తనిక్కడుండి అన్నీ చూసుకోవచ్చుగా? ఆయన గార్ని తీసుకురావడానికి మగాళ్లు పనికి రారు కాబోలు. అసలు పొద్దున్న అతగాడు ఊళ్లో దిగినప్పట్నుంచి తెగ పూసుకు తిరుగుతోందిలే."

-కమలాకర్‌కి చాలా బాధనిపించింది. ఇక వినలేక వడివడిగా ముందుకు అడుగులు వేశాడు.

గ్రీన్ రూంలోకి వెళ్తూనే బట్టలు మార్చుకుని, ప్రార్థన చేసుకుని, మేకప్ మేన్‌కి నమస్కరించి, పాత్రని అతనికి బోధించి, కదలకుండా కూర్చుని, మేకప్ పూర్తయ్యాక మళ్ళీ అతనికి నమస్కరించి, పాత్రోచితమైన దుస్తులు ధరించి, అద్దంలో చూసుకుని సంతృప్తిగా నిట్టూర్చాడు కమలాకర్.



'ఇప్పుడు జ్యోత్స్న వుంటే ఎంత బాగుండేది?! ఈ మేకప్ చూసి, జోకులు వేసేది. పాత్రని వివరిస్తూంటే శ్రద్ధగా వినేది. స్టేజిమీద తను మై మరచి నటిస్తూంటే తనూ సర్వం మరచి చూసేది':

మళ్ళీ ఇందాకటి వాలంటీర్ వచ్చాడు గ్రీన్ రూంలోకి.

"ఇంకో పావు గంటకి- అంటే టంచన్‌గా ఏడుగంటలకి కార్యక్రమం మొదలవుతుంది. ప్రార్థన అవుతూనే కమలాకర్ గారి మోనో ఏక్షన్" అన్నాడు.

త్రుళ్ళి పడ్డాడు కమలాకర్–

"జ్యోత్స్నని రానీండి – ఈ లోగా ఎవరిదైనా....."

"లేదండి. ఆవిడే కబురంపారు. హీరోగారు బయల్దేరడానికి ఆలస్యమవవచ్చుట. ఆయన బయల్దేరే వరకూ ఆమె వెయిట్ చెయ్యాలి కదా. అందుకని ఏడుగంటలకి ప్రార్థన చేసేసి, వెంటనే కమలాకర్ గారి మోనో ఏక్షన్, ఆ తర్వాత లైట్ మ్యూజిక్ చేయించెయ్యండని ఆవిడ కబురంపారు."

నిరుత్సాహపడి పోయాడు కమలాకర్.

జ్యోత్స్న లేకుండా పెర్ఫార్మెన్సా? అసలంత దూరం నుంచి వచ్చిందే ఆమె కోసం. మధ్యాహ్నం ఆమె అంత కేర్‌లెస్‌గా ప్రవర్తించినా, పెర్ఫార్మెన్స్ చూశాక అయినా ఆమెకు మళ్ళీ పాత స్నేహం గుర్తొచ్చి, అప్పటి అభిమానం పెల్లుబుకుతుందని కదా ఆశించింది!

క్షణాలు గడుస్తున్న కొద్దీ ఆమె కోసం అతనిలో ఆతృత ఎక్కువ కాజొచ్చింది.

ఏడయ్యింది.

ప్రార్థన ప్రారంభమయ్యింది.

రెండు నిముషాల్లో ముగిసింది.

కమలాకర్ మోనో యాక్షన్‌కి సంబంధించిన అనౌన్స్‌మెంట్ అయ్యింది. పూర్వ విద్యార్థి కమలాకర్ మోనో యాక్షన్ చేస్తాడనే అనౌన్స్‌మెంట్ వింటూనే కరతాళ ధ్వనులు మ్రోగాయి.

స్టేజి మీదకు వెళ్తూ వంగి కళ్ళ కద్దుకుని, ఆఖరి ఆశగా గుమ్మం వైపు చూశాడు జ్యోత్స్న కోసం. ఆమె రాలేదు. ఈ రోజు అమోఘమయిన ఏకపాత్రాభినయం చేయబోతున్నాడు తను. హాస్యంతో ప్రారంభమయి, రౌద్రంగా నడిచి, దుఃఖంతో సమాప్తమయ్యే పాత్ర అది. ఎప్పటి లాగే జ్యోత్స్న తనకి స్టేజి మీదకు వెళ్ళేముందు బెస్టాఫ్ లక్ చెప్తుతుందని ఆశించాడు. ఫలించలేదు.

ఇంక ఆలస్యం చేస్తే కళకి ద్రోహం చేసినట్టే.

మనస్సుని పాత్ర మీదకు మరల్చి, పరకాయ ప్రవేశం చేసి, రంగస్థలం మీదకు నడిచారు కమలాకర్.

అతన్ని చూస్తూనే తిరిగి హర్షధ్వానాలు చేశారు ప్రేక్షకులు.

అంతే – కళాకారుడ్ని హిమాలయాల శిఖరాగ్రాన కూర్చోపెట్టే ఆ హర్షధ్వానాలకు కమలాకర్ హృదయం ఆనంద తరంగమయి పోగా, అద్వితీయంగా అభినయాన్ని ప్రారంభించాడు. అతని అతిచక్కని ఆంగిక సాత్వికాభినయాలకు, విరిచి చెప్పే డైలాగ్ డెలివరికి పదేపదే తరంగాలుగా

# "ప్లీజ్ –నన్ను శపించు నేస్తం"

నవ్వులూ, చప్పట్లూ వినిపిస్తూనే వున్నాయి. పాత్ర స్వభావం ప్రకారం హాస్యాన్ని గుప్పించి, నెమ్మదిగా పాత్ర తాలూకు రెండవ ముఖాన్ని స్వంతం చేసుకుని, రౌద్ర రసాన్ని క్రమేపీ అభినయిస్తూ, ఉద్రేకంతో సంభాషణలు చెప్తూంటే – హాలంతా ఏ ఒక్కరు ఊపిరి వదిలినా వినిపించేటంతటి నిశ్శబ్దాన్ని సంతరించుకుంది. కనురెప్పలు వేయడం మరచి పోయి, నటరాజు ఆవహించిన కమలాకర్‌ని తదేకంగా చూస్తున్నారు ప్రేక్షకులు –

అంతలో –

అవాంతరం!!

నిశ్శబ్దానికి భంగం!!

కళకు తీరని కళంకం!!

– బయట పెద్ద చప్పుడు చేస్తూ ఆగిన కారులోంచి దిగిన హీరో గారు మెట్లెక్కి వస్తున్నారు. జ్యోత్స్న వెన్నెల నవ్వులు కురిపిస్తూ అతనికి అంటీ అంటనంత దూరంలో నడుస్తూ అతనికి ఆహ్వానం పలుకుతోంది. ప్రేక్షకులలో ఒకరి తర్వాత ఒకరూ అటువైపు చూడడం, తమ సహజమయిన వ్యామోహం కొద్దీ ఉత్సాహంగా కేకలు పెట్టడం, కొందరు లేచి నిలబడితే, మరికొందరు కుర్చీలను తోసుకుంటూ వరండాలోకి పరుగెత్తడం క్షణాల్లో జరిగిపోయింది.

హీరో లోపలకు అడుగు పెడుతూనే అందరికీ చేతులు ఊపేసరికి చాలామంది ఉత్సాహంతో చప్పట్లు చరిచారు.

ఒక్కసారిగా భయంకర నిశ్శబ్దం నుంచి వాతావరణం విపరీతమయిన గందరగోళ స్థితికి మారేసరికి, ఏకాగ్రత చెదిరిన కమలాకర్ అప్రతిభుడై, అంతలోనే నిలద్రొక్కుకుని, ధైర్యాన్ని కూడదీసుకుని, తనలో కలిగిన వికారాన్ని ముఖంలో అగుపడనీయకుండా జాగ్రత్త పడుతూనే, ఓరకంట గుమ్మం వైపు చూస్తూనే కారణం గ్రహించి, ఉగ్రుడయ్యాడు.

జ్యోత్స్నని మింగెయ్యాలన్నంత కోపం ఉబికింది అతనిలో.

జ్యోత్స్న నిర్లక్ష్యంగా స్టేజి మీదున్న కమలాకర్ వైపు చూసి, చికాకు పడిపోయింది. హాస్యం చెయ్యమంటే అరుపులు మొదలెట్టాడే అని విసుక్కుంది. అతిథికి పెడబొబ్బలతో ఆహ్వానం చెబుతున్నామేనని బాధ పడుతూ, కమలాకర్‌కి కనిపించేలా తల కొట్టుకొనేసరికి – గుండెల్లో గునపం దిగేసినట్టు మెలికలు తిరిగి పోయాడు. కమలాకర్.,

స్టేజి వైపొకసారి చూసి, నవ్వాపుకుంటూ, "ఎవరు పాపం అతనూ, అంతగా బాధ పడుతున్నాడూ?" అనడిగాడు హీరో జ్యోత్స్నని.

"ఎక్స్ స్టూడెంట్ - స్టేజెక్కితే ఓ పట్టాన దిగడు. గొప్ప జిడ్డు" అంది మళ్ళీ తల కొట్టుకుంటూ.

"ఏమిటట పాపం బాధ? మళ్ళీ కాలేజీలో చేరతాట్టా?" అంటూ ఫెళ్ళున నవ్వాడు హీరో. అతని నవ్వులో శృతి కలిపింది జ్యోత్స్న అతని ప్రక్క సీట్లో కూర్చుంటూ. వాలంటీర్ ఒకర్ని పిలిచి, మోనో యాక్షన్ త్వరగా ముగించమని కమలాకర్‌కి చెప్పమంది.

ప్రేక్షకుల్లో అలజడి ఇంకా తగ్గలేదు.

హీరో గారి వైపే వుంది అందరి దృష్టి.

అగ్నిపర్వతాలు బ్రద్దలవుతూన్నాయి కమలాకర్ గుండెల్లో. ఒళ్ళంతా చెమట ధారలుగా కారసాగింది. శరీరం మీద బట్టలొక్కొక్కటిగా ఎగిరిపోయి, తను అన్ని వందల మంది ముందు నగ్నంగా నిలబడ్డట్టు, అందరూ తనని చూసి పరిహసిస్తున్నట్టు భ్రాంతి కలుగుతూండగా – అదుపు తప్పిన ఆవేశంతో పిచ్చిగా ఘొల్లున ఏడుస్తూ, అంతలోనే పగలబడి నవ్వసాగాడు.

క్షణాల్లో మళ్ళీ హాలంతా నిశ్శబ్దం ఆవహించింది.

ఆ నిశ్శబ్దమే కమలాకర్‌ని అదుపు తప్పకుండా ఆదుకుంది. పరిస్థితి అర్థమయ్యింది అతనికి. కళాజీవితంలో మొట్టమొదటి సారిగా ఫెయిలయ్యే పరిస్థితి త్రుటిలో తప్పిందని గ్రహించాడు. తన అదృష్టం కొద్దీ పాత్ర ప్రకారం కూడా తను ఉన్మాద స్థితినే అభినయించి, శోకానికి బానిసయి పాత్రని ముగించాలి. ఉత్సాహంగా ముందుకు సాగాడు కమలాకర్.

మరో అయిదు నిముషాలకు ముగించాడు.

తెరపడింది.

మరో అరగంటలో మిగిలిన సాంస్కృతిక కార్యక్రమాలు ముగిసాయి. జ్యోత్స్న స్టేజి మీదకు వచ్చి మీటింగుకి ఏర్పాట్లు చేయించింది. కమలాకర్‌ని త్వరగా ముగించమని చెప్పలేక పోయిన వాలంటీర్ మీద సన్నగా విసుక్కుంది.

పాత్రలో నుంచి తిరిగి మామూలు మనిషిగా మారి, నీరసంగా నడిచి, గ్రీన్‌రూంలో ప్రవేశించి, వేషం మార్చుకున్నాడు కమలాకర్. ఇప్పటికయినా జ్యోత్స్న వచ్చి కంగ్రాట్యులేషన్స్ చెప్తుందేమోనని ఎదురు చూసాడు. ప్రేక్షకుల్లో ఎవ్వరూ కూడా వచ్చి అతన్ని అభినందించలేదు. అందరూ హీరో గారిని దగ్గర నుంచి చూడడానికి, ఆటోగ్రాఫ్‌లు తీసుకోవడానికి సంబరపడుతున్నారేగాని, కమలాకర్ ధ్యాసే ఎవ్వరికీ లేదు.

తెర తెరచుకుంది –

చిరునవ్వులు చిందిస్తూ, మైకు ముందు బొమ్మలా నిలబడి వుంది జ్యోత్స్న. గొంతు చిన్నగా సవరించుకుని, కాలేజీ ప్రిన్సిపాల్‌నీ, హీరో గారినీ వేదిక మీదకు ఆహ్వానించి, పూలదండలతో సత్కరించింది. ఆపైన హీరోగారిని తన భాషా పరిజ్ఞానం అంతా ఉపయోగించి కీర్తించింది. ఆయన క్రీగంట చిరునవ్వులతో కృతజ్ఞతలు అందజేస్తే – తన్మయత్వంతో అందుకుని, ఉప్పొంగే గుండెల్లో భద్రంగా దాచుకుంది.

తర్వాత హీరోగారు మాట్లాడారు. కాలేజీ అమ్మాయిలూ, అబ్బాయిలూ తన పిక్చర్లని ఎక్కువ

లైక్ చేస్తారనీ, అమ్మాయిలు తనకు ప్రేమలేఖలు విపరీతంగా వ్రాస్తూంటారనీ చెప్పారు. తర్వాత ఆయన ఉపన్యాసం జ్యోత్స్న పైకి మళ్ళింది.

"ప్రస్తుతం మా ఫీల్డులో చదువు, సంస్కారం, కళ వున్న హీరోయిన్లకు కరువుంది. జ్యోత్స్న గారికి ఇంట్రస్టు వుందో లేదో తెలియదు నాకు గానీ అందం, చలాకీతనం, చదువు, సంస్కారం, కళ వున్న ఆవిడ నెంబర్ వన్ హీరోయిన్ కాగలరు" అనగానే హాలంతా చప్పట్లు, ఈలలూ, గోల పేట్రేగి పోయింది.

జోత్స్న ఆనందంతో మెలికలు తిరిగి పోయింది.

మరో నిముషానికి తన ఉపన్యాసాన్ని ముగించి, కూర్చున్నాడు హీరోగారు.

ప్రిన్సిపాల్ శ్రీమతి జానకీప్రసాద్ గారు నిలబడ్డారు మైకు ముందు.

అంతా నిశ్శబ్దం- ఆవిడ యెడల గల భయ భక్తులకు తార్కాణం.

"సభకి వందనం. నేను ఇప్పుడు మన కాలేజీకి సంబంధించిన ఏ విషయాలూ మాట్లాడ బోవడం లేదు. నేటి కార్యక్రమానికి సంబంధించి రెండు ముక్కలు మాత్రం మాట్లాడుతాను. నేను పెద్దదాన్ని కాబట్టి, ఎవరినయినా నా మాటలు నొప్పిస్తే, అంతగా పట్టించు కోకూడదని కోరుతున్నాను, సరి అయిన పద్ధతిలో ఆలోచిస్తే నన్ను అపార్థం చేసుకునే అవకాశమే వుండదని కూడా మనవి చేస్తున్నాను.

"మన ముఖ్య అతిథి కూడా నాకంటే బాగా చిన్నవారు కాబట్టి, నన్ను తప్పుగా అర్థం చేసుకోరని నమ్ముతూ, నాలుగు మాటలు చెప్తున్నాను. నేను వీరి సినిమాలు ఏవీ చూడలేదు. మా పిల్లలు చూస్తూంటారు అన్ని సినిమాలూ. ఈ రోజుల్లో సినిమా హీరోకి నటనతో పరిచయం వుండాల్సిన అవసరం ఏమాత్రం లేదనీ, కాస్త ఎర్రగా బుర్రగా వుండి, నాలుగు ఫైట్లూ, అయిదు డ్యాన్సులూ చేయగలవాడే ఈ రోజుల్లో సినీ హీరో అని వాళ్ళంటూంటారు. మరందులో నిజమెంతో నాకు తెలియదు. అయితే వీరు అటువంటి హీరో అయ్యుండరని, మంచి నటులనీ నమ్ముతున్నాను."

-జ్యోత్స్న కంగారు పడింది, హీరోగారు కోపగించుకుంటారేమోనని. అయితే ఆయన గారు మాత్రం ఇప్పుడు అసలయిన నటన ప్రదర్శిస్తూ, తన లోని వికారాన్ని బహిర్గతం కాకుండా కాపాడు కుంటున్నాడు.

గ్రీన్‌రూంలో అవమాన భారంతో డీలా పడిపోయి కూర్చుని వున్న కమలాకర్‌లో కొద్దిగా చలనం కలిగింది. జ్యోత్స్న గాని, హీరోగాని తన మాటే ఎత్తలేదు. కనీసం ప్రోత్సాహం కోసమయినా తన నటన బాగుందనలేదు. ఇంక ప్రిన్సిపాల్ గారు తనని మెచ్చు కుంటారన్న ఆశ అతనికి ఏ కోశానా లేదు. కాలేజీలో చదువుతున్నన్నాళ్ళూ 'బుద్ధిగా చదువుకోక ఎందుకి నాటకాలు' అంటూ చివాట్లు పెడుతూండేవారు. అసలెప్పుడూ కల్చరల్ ప్రోగ్రాములు చూడడానికి రాని ఆవిడ ఈ వాళ వచ్చారు- బహుశా అందరితో బాటే తనూ ఒక పోటు పొడవడానికేమో.

"ఇంక ఈ రోజు ప్రోగ్రాం ఆర్గనైజేషన్ గురించి- వచ్చిన అతిథులు ఎంత గొప్ప వారయినప్పటికీ, అప్పటికి స్టేజి మీద జరుగు తూన్న ప్రదర్శనకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడవలసిన బాధ్యత కార్యకర్తలకు ఉంటుంది. చక్కటి ప్రదర్శన మధ్యలో అలజడి రేగి, అభాసు పాలయితే ఆ కళాకారులు ఎంతగా బాధ పడతారో నేను ఊహించగలను. ఈ రోజు కార్యక్రమం మధ్యలో జరిగిన ఆ అలజడిని నేను తీవ్రంగా గర్హిస్తూ, అది కార్యకర్తల అసమర్థతగా చెబుతున్నాను".

-జ్యోత్స్న ముఖం నల్లగా మాడి పోయింది.

యాంత్రికంగా తల దించుకుంది.

గ్రీన్‌రూంలో కమలాకర్ సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడు. గ్రీన్ రూంలోకి అమర్చబడ్డ స్పీకర్లోంచి ప్రిన్స్‌పాల్ గారి మాటలు మధురగీతమై వినిపించాయి అతని చెవులకు. యాంత్రికంగా లేచి, సైడ్ వింగ్‌లోకి నడిచి, ధైర్యంగా నిలబడి వినసాగాడు.

"అయితే విశేషమేమిటంటే, ఎప్పుడూ ఇటువంటి ఫంక్షన్స్‌కి వెళ్ళని నేను ఈ రోజు వచ్చినందుకు ఏమి బాధ పడటం లేదు. ఎందుకంటే ఈ రోజు జీవితాంతం గుర్తుంచుకోదగ్గ ఒక చక్కటి మోనో ఏక్షన్ చూశాను".

-కమలాకర్ తన చెవుల్ని తనే తప్పుగా అంచనా వేసుకోసాగాడు.

"ఇట్ వజ్ రియల్లీ సూపర్బ్- ఎక్స్ట్రాఆర్డినరీ- హైలైట్"

-కమలాకర్ హృదయంలో నూరు కోయిలలు కూసాయి.

"ఆ మోనో ఏక్షన్ చేసిన అబ్బాయి కమలాకర్‌ని నేను గత అయిదారేళ్ళుగా చూస్తూనే వున్నాను. ప్రతి సంవత్సరం ఈ నాటకాలనీ అవనీ ఇవనీ అతను తిరుగుతూన్నా నే నొక్కసారి కూడా చూడడం తటస్థించ లేదు. పైగా, మీరు నమ్మరేమో - వాత్సల్యం కొద్దీ 'శుభ్రంగా చదువుకోక ఈ భాగోతం లేవిటయ్యా' అని తిట్టేదాన్ని. అందుకు ఈ రోజు సిగ్గు పడుతున్నాను- అయామ్ రియల్లీ ఎషేమ్డ్".

-కమలాకర్ కళ్ళల్లో నీళ్ళు చిమ్మాయి. గుండెలు ఉబికాయి. అప్రయత్నంగానే రెండు చేతులూ ఎత్తి ఆవిడకు అక్కడ నుంచే నమస్కరించాడు.

"నిజంగా ఎంత గొప్పగా నటించా డతను!! పావుగంటలో విశ్వ రహస్యాన్ని మనముందుంచాడు. అంత తక్కువ సమయంలో ఒకే ఒక పాత్ర ద్వారా హాస్యాన్ని, రౌద్రాన్నీ, కరుణనీ కురిపిస్తూ, సందేశం అందించడం- రియల్లీ ఫెంటాస్టిక్. సభా ముఖంగా అభినందించడానికి అతన్ని స్టేజి మీదకు రావలసిందిగా కోరుతున్నాను."


ముకుళిత హస్తాలతో, ఆనందంతో తడబడే అడుగులతో, సజల నయనాలతో స్టేజి మీదకు వచ్చిన కమలాకర్- ముందు ప్రేక్షకులకు శిరస్సు వంచి అభివందనం చేసి, ప్రిన్సిపాల్ గారి దగ్గరకు నడిచి, వినమ్రుడై తల దించుకుని నిలుచున్నాడు. ఆవిడ వాత్సల్యంగా అతని భుజం తట్టి , "కంగ్రాట్యులేషన్స్ మై బోయ్ - విష్‌యు ఆల్ ది బెస్ట్" అనగానే సభాస్థలి అంతా హర్షధ్వానాలతో దద్ధరిల్లి పోయింది. ఉత్సాహ వంతులయిన కొందరు వచ్చి, కమలాకర్‌ని భుజాల మీదకు ఎత్తుకుని ప్రేక్షకుల లోనికి తీసుకు పోయారు.

మరో అయిదు నిముషాలకు సభ ముగిసింది.

ప్రిన్సిపాల్‌గారు బయల్దేరుతూన్న హీరోగారికి కృతజ్ఞతలు కాలేజీ తరపున తెలియజేశారు. ఆయన్ని దిగబెట్టడానికై సిద్ధమవుతూన్న జ్యోత్స్నని వారించి, ఒక లెక్చరర్ గారిని ఆపనికి నియమించి, జ్యోత్స్నతో, "ఆడపిల్లకు కొన్ని లిమిట్స్ అవసరం" అన్నారు, తీవ్రంగా.

★ ★ ★ ★ ★ ★

ట్రయిన్ టైముకి అరగంట ముందుగానే స్టేషన్‌కి



వచ్చాడు కమలాకర్. స్టేషనంతా అతనికి వీడ్కోలు చెప్పడానికి వచ్చిన స్నేహితులతో, కాలేజి స్టూడెంట్లతో కళకళలాడుతోంది. వాళ్లందరి తోనూ ఎంతో ఆత్మీయత, అభిమానాలతో సరదాగా కబుర్లాడి, ట్రయిన్ కదులుతూండగా ఎక్కి, అందరి దగ్గరా చెమర్చిన కళ్లతో శలవు తీసుకుంటూన్న కమలాకర్ చూపులో– అందరి వెనుకగా.... చీకట్లో ... ఒంటరిగా నిలబడి.... తనకు చేయి ఊపుతూ వీడ్కోలు చెపుతూన్న జ్యోత్స్న పడడం, అతను తేరుకుని ఆమె వైపు ప్రత్యేకంగా చేయి ఊపే అవకాశమే ఇవ్వకుండా రైలు వేగం పుంజుకుని, ముందుకు సాగి పోవడం క్షణాల్లో జరిగి పోయింది.

★ ★ ★ ★ ★ ★

సరిగ్గా రెండు రోజులకి ఒక ఉత్తరం అందుకున్నాడు కమలాకర్.

"డియర్ కమలాకర్,

క్షమించమని అడిగే అర్హత కోల్పోయినా క్షమాపణలు కోరుకుంటున్నాను. నీ ప్రోత్సాహంతో గుర్తింపు సంపాదించుకున్న నేను– నిన్ను గుర్తు పట్టనంత నిర్లక్ష్యంగా ప్రవర్తించానంటే, నిజంగా రాక్షసత్వం నన్నావహించినట్లే. నాన్నగారి పలుకు బడితో హీరోని తీసుకు రాగలిగాను. మన కాలేజీకి మొట్టమొదటి సారిగా అంత పేరు ప్రఖ్యాతులున్న వ్యక్తిని తేగలిగిన ఘనత నాకు దక్కిందన్న గర్వంతో కళ్ళు మూసుకు పోయాయి నాకు. అతని ముందు నా

## పిచ్చిమాటలు

"మీ బ్రతుకుల్లో కూడా
ఉషోదయం వస్తుందని"
ఎవరో అన్న ఆ
పిచ్చిమాటల్ని పట్టుకొని
చేతులు కట్టుకొని
తూర్పున చూస్తూ కూర్చోకు–
ఎందుకంటే
ఆ ఉషోదయం వచ్చేది ప్రకృతి నుంచి–
మన బ్రతుకుల్లో,
ఈ ఉషోదయం వచ్చేది మన చైతన్య జాగృతి
నుంచి

–షేక్ అక్బర్ బాషా

## "ప్లీజ్ – నన్ను శపించు నేస్తం"

మైకం కమ్మిన కళ్లకు నువ్వు ఎంతో తక్కువ వాడివిగా కనిపించావు. నేను తలచుకుంటే నీవంటి చిన్న కళాకారుల్ని వెయ్యిమందిని నా చుట్టూ దీపంచుట్టూ పురుగుల్లా తిప్పుకోగలననే భ్రాంతిలో మునిగి పోయాను.

అతని దృష్టిని ఆకర్షించ గలిగాను కాబట్టి వీలయితే అతని ప్రోత్సాహంతో నేనూ పాపులర్ కావాలని దురాశ పడ్డాను. అందుకనే నేను అతని చుట్టూ తిరగడమే కాక మా స్నేహితురాళ్లని కూడా తీసుకెళ్లి అతనికి పరిచయం చేసి, జోకులతో, ఇక ఇకలతో, పకపకలతో అతన్ని తృప్తి పరిచాను. అప్పటి కప్పుడు ఎంజాయ్ చేసి వెళ్లిపోయే అటువంటి వాళ్లకు నేనొక లెఖ్ఖా? నాలాంటి వాళ్లెందరో?!

ప్రిన్సిపాల్ గారి స్పీచ్ నాకళ్ళు తెరిపించింది.


అప్పట్నుంచే నా అసలు కమలాకర్ నాకు కనిపించసాగాడు. నా గురువు, నా నేస్తం, నా అప్పుడు, నా సోదరుడు, ...., నా ముందు చిరునవ్వుతో ప్రత్యక్షమయ్యాడు. గొఱ్ఱెల మందలో గొఱ్ఱెలా అందరితో బాటే నేనూ పాపులర్ అయిన వ్యక్తినే ఆకాశానికి ఎత్తి చూపద్దామనుకున్నాను గాని, అసలైన కళాకారుడవయ్యిండి గుర్తింపు పొందవలసిన నిన్ను విస్మరించి, కృతఘ్నతతో ప్రవర్తించాను.

ఈ అల్పురాలు ఉపేక్షించినా సరైన సన్మానం సహృదయులే చేశారు.

క్షమించక పోయినా ఫర్వాలేదు– తిడుతూ నయినా జవాబు వ్రాస్తే ఈ జన్మకు తృప్తి.

నీ, కృతఘ్నురాలైన శిష్యురాలు– జ్యోత్స్న."

–చదవడం పూర్తి చేసి, ఉత్తరాన్ని మడచి, పెదవులకు తాకించుకుని, లోలోనే నవ్వుకుంటూ, ఇలా అనుకున్నాడు కమలాకర్, –"పిచ్చిపిల్ల". □

TARA-CBNPW 1326/85